# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 215

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: ఆదివారం 06 సెప్టెంబర్ 2026








**ఢిల్లీ, సెప్టెంబర్ 5, సమయం ప్రతినిధి:** దేశ రాజధాని ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఈ రోజు(శనివారం) వర్షాలు దంచికొడుతున్నాయి. రోడ్లు జలమయం కావడంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. దీంతో వాతావరణ అధికారులు ఆయా ప్రాంతాల్లో రెడ్ అలెర్ట్ నోటీసులు జారీ చేశారు. ప్రముఖ సంస్థ ఇండిగోతో సహా కొన్ని ఎయిర్‌లైన్ సర్వీసులు తమ ప్రయాణికులకు సూచనలు చేశాయి. విమాన రాకపోకల్లో అంతరాయాలు ఏర్పడొచ్చని, ఎయిర్‌పోర్టుకు వెళ్లే ముందే సర్వీసుల స్థితిని తెలుసుకోవాలని తెలిపాయి. అలాగే టాటా గ్రూప్ నేతృత్వంలోని ఎయిర్ ఇండియా కూడా ప్రయాణికులను హెచ్చరించింది.

**కొన్ని ప్రాంతాలు జలమయం**

శనివారం ఉదయం దేశ రాజధానిలోని గీతా కాలనీ, అక్బర్ రోడ్ తదితర ప్రాంతల్లో భారీ వర్షాలు పడ్డాయి. అధిక వర్షపాతం కారణంగా ఆ ప్రాంతాలు జలమయంగా మారాయి. గ్రేటర్ నొయిడాలో కూడా ఎడతెరిపిలేని వానలు కురిశాయి.

ఢిల్లీ ఉష్ణోగ్రతలు నిన్నటి కంటి 3.4 శాతం తగ్గాయని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు సఫ్దర్‌జంగ్ ప్రాంతంలో 0.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని చెప్పింది.




**సమయం ప్రతినిధి:** హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గ అభివృద్ధి పనులపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తాజాగా సమీక్ష నిర్వహించారు. జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో అధికారులను ఆమె గట్టిగా నిలదీశారు. సుమారు రూ.11 కోట్ల ఎంపీ నిధులు విడుదలైనా అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల పనితీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ వారిని ' సోమరులు, పూర్తిగా అసమర్థులు' అంటూ ఆమె విమర్శించారు. మండి నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనులపై అధికారులు పదేపదే హామీలు ఇస్తున్నారని, కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పనులు కనిపించడం లేదని కంగన మండిపడ్డారు. ఇక మాటలు చెప్పడం ఆపి.. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ నిధుల వినియోగంపై గత సమావేశాల్లో కూడా తాను ప్రశ్నించానని, అప్పుడు నిధుల వినియోగంలో ఎలాంటి సమస్యా లేదని అధికారులు చెప్పారని ఆమె అన్నారు. అయితే తర్వాత బయటి సంస్థల సర్వేలతో అసలు పరిస్థితి బయటపడిందని కంగన పేర్కొన్నారు. మండి నియోజకవర్గంలో కొన్ని అభివృద్ధి పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. భూమి అందుబాటులో లేకపోవడం, అవసరమైన అనుమతులు రాకపోవడం వంటి కారణాలతో కొన్ని పనులు ఆలస్యమైనట్లు చెప్పారు. అయితే ఈ కారణాలు చెబుతూ పనులను మరింత ఆలస్యం చేయడానికి వీల్లేదని కంగన స్పష్టం చేశారు.




**హైదరాబాద్, సెప్టెంబరు 5, సమయం ప్రతినిధి:** నగరంలోని డెయిరీ ఉత్పత్తుల తయారీ కేంద్రాలపై టీజీ సేఫ్(తెలంగాణ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఏకకాలంలో 14 తయారీ కేంద్రాల్లో మొత్తం 12 బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఫుడ్ సేఫ్టీ, పోలీసులు, హెచ్ ఫాస్ట్ బృందాలు సంయుక్తంగా చేసిన ఈ సోదాల్లో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. చాలా డెయిరీ కేంద్రాలలో రసాయనాలతో పనీరు తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పనీరు తయారీలో పామాయిల్, గ్లిసరాల్ మోనోస్టియరేట్ వంటి రసాయనాలను అధిక మొత్తంలో వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చాలా కేంద్రాల్లో పరిశుభ్రత లోపించినట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. రూ.7.19 లక్షల విలువైన ఆహార పదార్థాలు సీజ్ చేసినట్లు వారు పేర్కొన్నారు. కల్తీకి పాల్పడ్డారన్న అనుమానంతో 21 ఆహారపదార్థాల శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించామని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు. కల్తీ ఆహారపదార్థాలు ఉత్పత్తి చేస్తోన్న మూడు డెయిరీ యూనిట్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను రద్దు చేశామని అధికారులు వెల్లడించారు. పలు తయారీ కేంద్రాలు కనీస ఆహార భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని అధికారులు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన పలు కేంద్రాలకు నోటీసులు జారీ చేసినట్లు వారు పేర్కొన్నారు.

## విశిష్ట ప్రతిభా పురస్కారం అందుకున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**సమయం ప్రతినిధి :** రాష్ట్రంలోని కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో విద్యా పరిపాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రతిష్ఠాత్మక ప్రతిభా పురస్కారం-2026 ను అందుకున్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెంపు లక్ష్య సాధనలో మంచిర్యాల జిల్లా విశిష్ట ప్రతిభ కనబరిచింది. 2025-26లో 43 వేల 72 మంది విద్యార్థులు ఉండగా, 2026-27లో ఈ సంఖ్య 45 వేల 626కు పెరిగి 2 వేల 554 మంది అదనంగా చేరారు. 2024-25తో పోలిస్తే రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 10.34 శాతం పెరిగింది. జిల్లాలోని 282 ప్రభుత్వ పాఠశాలలలో 10 శాతానికి పైగా అదనపు నమోదు సాధించగా, మందమర్రి, నస్పూర్, జైపూర్, హాజీపూర్, భీమారం మండలాలలో 10 శాతానికి పైగా నమోదు పెరిగింది. అలాగే 2026-27లో 4 వేల 346 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వీడి ప్రభుత్వ పాఠశాలలలో చేరడం ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులలో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎం ఐ ఎస్, సి సి ఓ లు, సి ఆర్ పి ల సమన్వయంతో చేపట్టిన కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ, సమష్టితో జిల్లాలో విద్యాభివృద్ధి సాధ్యపడింది. మంచిర్యాల జిల్లాకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు లభించింది.

**రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో సీట్లు పెరిగితే 117 సీట్లలో గెలుస్తామని, సీట్లు పెరగకపోతే 97 సీట్లతో కాంగ్రెస్ గెలుస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (Telangana CM Revanth Reddy) ధీమా వ్యక్తం చేశారు. 2024 నుంచి 2034 వరకు పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని.. ఇదే బీఆర్ఎస్, బీజేపీలకు తన సవాల్ అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అనే మొక్కను ఏ ఎన్నికల్లోనూ తాను మొలవనివ్వనని హెచ్చరించారు.**




**నల్లగొండ, సెప్టెంబర్ 5, సమయం ప్రతినిధి :** ఈ నెలాఖరుకు సిరిసిల్లకు వస్తా... మూడు రంగుల జెండా ఎగురవేస్తా.. వచ్చేనెల సిద్దిపేటపై దండయాత్ర చేస్తా.. కాస్కోవాలని సవాల్ చేశారు. నల్లగొండ జిల్లాలోని నకిరేకల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈరోజు (శనివారం) పర్యటించారు. ఈ పర్యటనలో రూ.345 కోట్లతో 12 అభివృద్ధి పనుల శిలాఫలకాలను సీఎం ఆవిష్కరించారు. నకిరేకల్‌లో 100 పడకల ప్రభుత్వాస్పత్రిని ప్రారంభించారు. ఈ ఆస్పత్రిలో పలు విభాగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు రఘువీర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

**మీరిచ్చిన రైతు రుణమాఫీ మిత్తిలకే సరిపోయింది..**

'కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో గొప్ప పథకాలు అమలు చేస్తే కొంతమంది జీర్ణించుకోలేక.. ఊరూరు తిరుగుతున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన... మా హయాంలోని వెయ్యి రోజుల పాలనను బేరీజు వేసుకోండి. మీరిచ్చిన రైతు రుణమాఫీ మిత్తిలకే సరిపోయింది. చివరి రైతు భరోసా వేస్తానని మోసగించి కేసీఆర్ గద్దె దిగారు. మీరు ఎగ్గొట్టిన రైతు భరోసా 32 నెలల్లో రూ.36 వేల కోట్లను రైతులకు మేము చెల్లించాం. ధాన్యం కొనుగోళ్లు, రైతు భరోసా, రుణమాఫీ 30 నెలల్లో చెల్లించాం. కోటి మంది ఆడబిడ్డలకు ఒక్కొక్కరికీ నెలకు రూ.10 వేల చొప్పున ఖర్చులు మిగిలాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత కాలం ఇందిరమ్మ రాజ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుంది. ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడం కోసం అన్ని పథకాల్లో వారిని భాగస్వామ్యం చేశాం. కేసీఆర్ ఏనాడైనా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారా.?, మేము ఇచ్చే పథకాలు ఏమైనా ఇచ్చారా.?. ఫాంహౌస్‌కు పరిమితమైన కేసీఆర్ పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగదు. మీరే నోటిఫికేషన్లు ఇస్తే ఎందుకు మీ హయాంలో నియామకాలు చేపట్టలేదు. 72వేల ఉద్యోగాలను మొదటి ఏడాదిలోనే.. దేశంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది' అని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు.

**కాకుల్లా ఊరు మీద బడి దోచుకునేందుకు తిరుగుతున్నారు..**

'కేసీఆర్ సీఎం అయితే హరీశ్‌రావు, కేటీఆర్‌లను మంత్రులను చేశారు. నేను సీఎం అయితే అందరికీ మంత్రి పదవులు, ఎంపీ పదవులు, ఎమ్మెల్సీలను చేశా. కేసీఆర్ సీఎం అయితే ఆయన విగ్రహం కోసం ఐదెకరాలకు కాంపౌండ్ పెట్టారు. కాకుల్లా ఊరు మీదబడి దోచుకునేందుకు తిరుగుతున్నారు. మా పాలనను చూసి బావ, బామ్మర్దులు గుక్క పెట్టి ఏడుస్తున్నారు. నాకు చదువు లేదని అంటున్నారు.. సంస్కారం ఉంది. కాబట్టే మీరు ఇలా ఉన్నారు. రాఖీ కట్టడానికి వచ్చిన సొంత చెల్లిని మెడబట్టి కేటీఆర్ గెంటారు. గుంటూరులో చదివిన నువ్వు తెలంగాణ కోసం ఏం చేశావ్.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 5:** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై జిల్లా స్థాయి శాంతి కమిటీ సమావేశం జిల్లా ఎస్పీ డి.జానకితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రూపొందించిన సైబర్ నేరాలపై అవగాహన కల్పించే ప్రత్యేక వినాయక చవితి సైబర్ అవగాహన పోస్టర్‌ను కలెక్టర్, ఎస్పీలు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు గణేష్ మండపాలను సందర్శించే అవకాశం ఉన్నందున, ఈ సందర్భంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ సైబర్ నేరగాళు ప్రస్తుతం వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అపరిచిత లింకులు, ఫోన్ కాల్స్, సందేశాలు, నకిలీ ప్రకటనలు, ఇతర ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన సైబర్ నేరాలపై జాగ్రత్తలు సూచించే పోస్టర్లను జిల్లాలోని ప్రతి గణేష్ మండపంలో ఏర్పాటు చేయాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులను కోరారు. ప్రతి మండపంలో సైబర్ అవగాహన పోస్టర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా వినాయక దర్శనానికి వచ్చే భక్తులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించడంతో పాటు వారు మోసాలకు గురికాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

**కలెక్టర్ కార్యాలయంలో మొక్కలు నాటిన కలెక్టర్, ఎస్పీ**

అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి.జానకి, ఇతర అధికారులు జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.నిర్మల, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు. వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించడంతో పాటు ప్రజల భద్రత, సైబర్ భద్రత, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్, ఎస్పీలు కోరారు. "శాంతియుత వినాయక చవితి-సైబర్ సురక్షిత సమాజం- పచ్చని పర్యావరణం" లక్ష్యంగా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.




**హైదరాబాద్, సెప్టెంబర్ 05, సమయం ప్రతినిధి :** సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు (Ramchander Rao) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్రపూరితంగానే భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని ధ్వజమెత్తారు. 22ఏతో మధ్యతరగతి ప్రజలు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్ ఇందిరాపార్క్ దగ్గర బీజేపీ మహాధర్నా చేపట్టింది. ఈ ధర్నాలో రాంచందర్ రావు పాల్గొని మాట్లాడారు. 22ఏ భూ భారతి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భూ సంస్కరణల పేరుతో భూ భారతిని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చారని అన్నారు.

**22ఏ భూముల వ్యవహారంపై న్యాయ విచారణ జరపాలి..**

గతంలో 15 శాతం కమీషన్ ఉంటే.. ఇప్పుడు 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారని రాంచందర్ రావు ఆరోపించారు. 22ఏ భూముల వ్యవహారంపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా క్షీణించిందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే అని రాంచందర్ రావు ఎద్దేవా చేశారు.

సమయం
ఆదివారం 06 సెప్టెంబర్ 2026

# సంపాదకీయం

## విద్యార్థుల తలరాతను తిరగరాసే విధాత

విద్యార్థుల తలరాతను మార్చేది ఉపాధ్యాయులే. కోట్లాది మంది విద్యార్థుల జీవితాల్లో విజ్ఞానం, నైపుణ్యాలు, విలువలు, స్ఫూర్తి నింపి సుసంపన్నం చేస్తున్న గురువులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భారతీయులందరి తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తన జన్మదినోత్సవాన్ని 'ఉపాధ్యాయ దినోత్సవం'గా నిర్వహించాలని భారతదేశానికి రెండో రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆకాంక్షించిన విషయం అందరికీ తెలిసిందే. ఆయన అంతర్జాతీయంగా ఖ్యాతిగాంచిన మేధావి. ప్రఖ్యాత రచయిత. గొప్ప రాజనీతిజ్ఞుడు. అయినప్పటికీ ఉపాధ్యాయునిగా తాను పోషించిన పాత్రనే అన్నింటి కంటే మిన్నగా భావించారు. అత్యంత ఆదరణ పొందిన రాష్ట్రపతుల్లో ఒకరైన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను ఒక సందర్భంలో.. 'మిమ్మల్ని ప్రజలు ఓ శాస్త్రవేత్తగా గుర్తుంచుకోవాలా? రాష్ట్రపతిగా గుర్తుంచుకోవాలా?' అని ఒకరు ప్రశ్నించారు. తనను ఓ ఉపాధ్యాయుడిగా గుర్తుంచుకోవాలని కలాం సమాధానమిచ్చారు. సామర్థ్యం, నైతిక విలువలే ఉపాధ్యాయులను పూజనీయులుగా మారుస్తాయి. అలాంటి వారినే విద్యార్థులు దైవంగా భావిస్తారు. వారినే ఆదర్శంగా తీసుకుంటారు. తమ సంతానం మాదిరిగానే విద్యార్థులను కూడా ఉపాధ్యాయులు ప్రేమించాలని మన ప్రాచీన గ్రంథాలు సూచిస్తున్నాయి. వారిని సమానంగా, న్యాయభావంతో చూడాలని, విద్యార్థులపై కోపం ప్రదర్శించకూడదని, సహనంతో ఉండాలని తెలియజేస్తున్నాయి. విద్యార్థుల సంక్షేమానికే ప్రాధాన్యమిచ్చి వారి సామర్థ్యానికి అనుగుణంగా బోధించాలని నిర్దేశిస్తున్నాయి. అలాంటి గురువులను గౌరవిస్తూ... 'ఆచార్యదేవో భవ' అనే కాలాతీత సందేశాన్ని దాదాపు మూడు సహస్రాబ్దాల క్రితం నాటి తైత్తిరీయ ఉపనిషత్తులోని శిక్షావల్లి అందిస్తోంది. ఎంతోమంది వివేకవంతులైన, ప్రేమ నిండిన ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని పొందడం నాకు కలిగిన గొప్ప అదృష్టం. కొన్ని సందర్భాల్లో పాఠశాల సమయం ముగిసిన తర్వాత సైతం తమ గృహాల్లోనే వారు మాకు పాఠాలు చెప్పేవారు. మమ్మల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకునేవారు. ఏడో తరగతి తర్వాత పై చదువుల కోసం మా ఊరు నుంచి బయటకు వెళ్లిన మొదటి అమ్మాయిని నేనే. ఆ తర్వాత భువనేశ్వర్‌లో చదువుతున్నప్పుడూ నా ఉపాధ్యాయుల నుంచి అపారమైన ప్రేమను, ప్రోత్సాహాన్ని పొందగలగడం నాకు దక్కిన భాగ్యం. నా ఉపాధ్యాయుల గురించి ఎంతో వినయంగా ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఎందుకంటే... 'ప్రేమ, అంకితభావం ఉన్న ఉపాధ్యాయుడు విద్యార్థిలో అపరిమితమైన సామర్థ్యాన్ని, స్ఫూర్తిని మేల్కొల్పగలరు' అనే గొప్ప సత్యాన్ని వారి కథ తెలియజేస్తుంది. ఆ ప్రోత్సాహం అందించే తోడ్పాటుతోనే జీవితంలో ఎదురయ్యే అత్యంత కఠినమైన సవాళ్లను ఎదుర్కొనే, అత్యున్నత లక్ష్యాలను సాధించే విశ్వాసాన్ని విద్యార్థులు వృద్ధి చేసుకోగలుగుతారు. ఉపాధ్యాయులు బోధనకే పరిమితం కాకుండా తమ ప్రవర్తన, ఆదర్శాల ద్వారా ఫలప్రదమైన జీవితాన్ని గడపడానికి అవసరమైన కళను, నైపుణ్యాలను సైతం విద్యార్థులకు నేర్పిస్తారు. విద్యా ప్రయాణంలో విద్యార్థికి మార్గదర్శిగా, శ్రేయోభిలాషిగా, స్నేహితునిగా, సహ ప్రయాణికునిగా ఉపాధ్యాయులు ఉంటారు. మంచి ఉపాధ్యాయున్ని తీర్చిదిద్దే సూక్ష్మం... ప్రాచీన కాలం నుంచి మన సంస్కృతీ సంప్రదాయాల ద్వారా మనకు లభించింది. అది నేటి కాలానికి సైతం వర్తిస్తుంది. శతాబ్దాల క్రితం, మహాకవి కాళిదాసు తన 'మాళవికాగ్ని మిత్రం' నాటకంలో 'అపారమైన జ్ఞానాన్ని కలిగి ఉండటంతో పాటు, దానిని ఇతరులకు అందించగల సామర్థ్యం ఉన్నవారే మంచి ఉపాధ్యాయుడు' అని రాశారు.ఓ ప్రసిద్ధ సంస్కృత సూక్తి మనకు ఇలా చెబుతోంది. 'సర్వత్ర విజయం ఇచ్ఛేత్, శిష్యాత్ ఇచ్ఛేత్ పరాజయం' – ఎక్కడైనా విజయాన్ని కోరుకోవచ్చు. కానీ శిష్యుని ముందు ఓటమిని కోరుకోవాలి అని దానర్థం. విద్యార్థుల్లో స్వతంత్ర ఆలోచనలను ప్రోత్సహించడం, వారిలో ఆసక్తిని రేకెత్తించడం, తర్కాన్ని, ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించడం, నిర్ణయ సామర్థ్యానికి పదునుపెట్టడం, వారు సాధికారత సాధించిన వ్యక్తులుగా ఎదగడానికి సాయపడటం ఇవే బోధనకు ఉన్న అత్యంత ఉపయోగకరమైన, ప్రతిఫలాన్ని అందించే అంశాల్లో కొన్ని. ఇలాంటి స్ఫూర్తిదాయకమైన విద్య ద్వారా మాత్రమే విజయవంతమైన వ్యాపారవేత్తలు, ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, సృజనాత్మకత ఉన్న కళాకారులు, ఆధునిక సవాళ్లకు వినూత్న పరిష్కారాలు అందించే పౌరులను సిద్ధం చేయగలం.బోధన అంటే వృత్తి మాత్రమే కాదు. అది ఓ ప్రతిజ్ఞ. అది ఉద్యోగం లేదా పని కంటే ఎక్కువ. అది మానవాళిని తీర్చిదిద్దే పవిత్రమైన కార్యం. భవిష్యత్తు తరాలకు ప్రకాశవంతమైన మార్గాన్ని అందించే ఉన్నతమైన బాధ్యత. బోధనకు సంబంధించిన నా జ్ఞాపకాలు నాకు ప్రత్యేకమైన సంతృప్తిని ఇస్తాయి. నేను ఒడిశాలోని రాయరంగ్‌పూర్‌లో ఉన్న శ్రీ అరబిందో ఇంటిగ్రల్ పాఠశాలలో చిన్నారులకు బోధించాను. వివిధ పాఠ్యాంశాలను బోధించడంతో పాటు... సంగీత ప్రదర్శనలకు, క్రీడలకు, నాటకాలకు వారిని సిద్ధం చేయడంలో పూర్తిగా నిమగ్నమై ఉండేదాన్ని. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం మా సన్నాహాలను, ఆ సమయంలో పిల్లల ఆనందోత్సాహాలను గుర్తుచేసుకుంటే ఈనాటికీ నాకు ఎంతో సంతోషం కలుగుతుంది. విద్యార్థులను అందమైన ప్రదేశాలకు విహారయాత్రలకు తీసుకెళ్లడంలోను, జంతువులు, పక్షులు, చెట్లు, మొక్కల ప్రపంచాన్ని ఆటలు, అన్వేషణ ద్వారా వారికి పరిచయం చేయడంలోనూ గొప్ప సంతృప్తిని, అర్థాన్ని కనుగొన్నాను.పాఠశాల విద్య పూర్తయి ఏళ్లు గడిచినా... ఇప్పటికీ నా విద్యార్థులు వారి కుటుంబ కార్యక్రమాలకు నన్ను ఆహ్వానిస్తుంటారు. నా విద్యార్థుల్లో చాలామంది పేర్లు ఇంకా నాకు స్పష్టంగా గుర్తున్నాయి. వాటితో పాటు మేం వారిని పిలిచిన మారుపేర్లు కూడా గుర్తున్నాయి. నా విద్యార్థుల నుంచి నేను కూడా చాలా నేర్చుకున్నాను. బాలల నుంచి.. తక్షణమే స్పందించే గుణాన్ని, ఆసక్తిని ఉపాధ్యాయులు నేర్చుకుంటారని నేను విశ్వసిస్తాను. నేను రాష్ట్రపతిగా రెండో సంవత్సరాన్ని పూర్తి చేసుకున్నప్పుడు రాష్ట్రపతి భవన్ ఆవరణలోని పాఠశాల విద్యార్థులతో సమయం గడిపాను. అప్పుడు వారికి పర్యావరణ పరిరక్షణ గురించి వివరించాను. నేను ఎల్లప్పుడూ విద్యార్థులను కలవడానికి, వారి ఆలోచనలను, అభిప్రాయాలను అర్థం చేసుకోవడానికి ఆసక్తి చూపుతాను. వారు పంచుకునే విషయాలు నాకు గుర్తుండిపోతాయి.సుమారు పదకొండేళ్ల క్రితం, నేను మా ఊరిలో ఒక గురుకుల పాఠశాలను స్థాపించాను. ఆ పాఠశాలలో పేద విద్యార్థులు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలలు చదువుకుంటారు. వారిని కలుసుకునేందుకు అప్పుడప్పుడూ ఆ పాఠశాలను సందర్శిస్తుంటాను. ఈ ఏడాది జూన్ 20న నా పుట్టినరోజు సందర్భంగా ఆ బాలలతో సమయం గడపడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సైతం నాతో పాటు ఆ పాఠశాలను సందర్శించి వారిలో స్ఫూర్తి నింపారు. ప్రధానిని కలుసుకున్న అసాధారణ అనుభవం వారికి చిరకాలం స్ఫూర్తినిచ్చేదిగా నిలిచిపోతుంది. వారి అభివృద్ధిని చూడటం నాలో ఒక ప్రత్యేకమైన అర్థవంతమైన భావనను నింపుతుంది.విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులకు మాత్రమే పరిమితం కాదు. తమ ప్రవర్తన, విజయాల ద్వారా బాలలకు ఆదర్శంగా నిలిచేవారు కూడా నేర్చుకోవడానికి, స్ఫూర్తికి విలువైన వనరుగా ఉంటారు.తమ పిల్లలను చదువుకోవడానికి పంపించేటప్పుడు ఉపాధ్యాయులపై తల్లిదండ్రులు, సంరక్షకులు అత్యంత విశ్వాసాన్ని ఉంచుతారు. విద్యార్థులను తమ సొంత పిల్లల్లా చూసుకుంటారని, వారి భద్రత, అభివృద్ధి విషయంలో అత్యంత శ్రద్ధ తీసుకుంటారని నమ్ముతారు. తమపై ఉంచిన ఈ పవిత్రమైన నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి ఉపాధ్యాయుని ధర్మం. ఉపాధ్యాయుని వైఖరి, ప్రవర్తన, నడవడిక బాలల్లో భయాందోళనలను కలిగించకూడదు, వారి మనోధైర్యాన్ని దెబ్బతీయకూడదు. లేదా వారిలో ఎలాంటి న్యూనతా భావం పెరిగేలా చేయకూడదు.తమ విద్యార్థులను మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దే పవిత్ర మైన బాధ్యత ఉపాధ్యాయులదే. తమ ఆలోచనల్లో, చేతల్లో నైతికతను పాటిస్తూ... సంపదను, కీర్తిని సాధించే విద్యార్థులే ఉపాధ్యాయుని విజయానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తారు. సామాజిక సమ్మిళితత్వమే కేంద్రంగా, అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలనే లక్ష్యం దిశగా భారత్ స్థిరంగా ప్రయాణిస్తోంది.

## చెంచు కుటుంబాల పునరావాసానికి రూ.4.50 కోట్లతో అభివృద్ధి పనులు

### బాచారంలో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణానికి మంత్రులు దినసరి సీతక్క, జూపల్లి కృష్ణారావు,ఎంపీ, కలెక్టర్ శంకుస్థాపన





నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 05: నాగర్‌కర్నూల్ నల్లమల టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని మూడు గ్రామాలకు చెందిన 257 చెంచు కుటుంబాల పునరావాసం కోసం కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండలంలోని బాచారం గ్రామంలో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బాచారం గ్రామంలో రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, పునరావాస కాలనీ నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రులు దినసరి అనసూయ సీతక్క, జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు కుటుంబాలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, పునరావాస కాలనీలో సురక్షితమైన, గౌరవప్రదమైన జీవన పరిస్థితులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. కాలనీలో అవసరమైన రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, ఎఫ్‌డీఓ చంద్రప్రకాశ్ సింగల్ చర్లపల్లి పాచారం, అదనపు కలెక్టర్ దేవసహాయం, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాలకు చెందిన చెంచు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సౌకర్యమే లక్ష్యంగా మార్కెట్ అభివృద్ధి: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) ప్రజల సౌకర్యమే లక్ష్యంగా మార్కెట్ అభివృద్ధి చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నామని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నగరం 58వ డివిజన్ లో 5.02 కోట్లతో నిర్మించిన అధునాతన సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధిలో ఈరోజు ఎంతో ముఖ్యమైన రోజు అని తెలుపుతూ, నగరంలోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల నూతన భవన నిర్మాణానికి ?20 కోట్లతో భూమిపూజ చేశామని, అలాగే ఈ రోజు సమీకృత వెజ్-నాన్ వెజ్ మార్కెట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ కాలేజీ కాంప్లెక్స్ నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా మార్కెట్‌లో వ్యాపారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. దుకాణాల అలైన్‌మెంట్, కేటాయింపులను త్వరలో పూర్తి చేసి ప్రతి ఒక్కరికీ అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. వ్యాపారుల కోసం ప్రత్యేకంగా మంచినీటి ప్లాంట్, రిఫ్రిజిరేటర్, నీటి డబ్బాలు ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్తులో టాయిలెట్లు, విశ్రాంతి గదులు తదితర సౌకర్యాలను కూడా కల్పిస్తామని చెప్పారు. వ్యాపారులకు ఇంకా ఏవైనా సదుపాయాలు అవసరమైతే వాటిని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తాను తైబజార్‌ను రద్దు చేసినట్లు గుర్తు చేస్తూ, దీంతో నగరంలోని వేలాది మంది చిన్న వ్యాపారులకు ఆర్థిక భారం తగ్గిందన్నారు. తైబజార్ రద్దు కావడంతో వ్యాపారులు ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. మార్కెట్ వెలుపల రోడ్డుపై వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఇకపై ఎవరూ రోడ్డుపై కూర్చొని వ్యాపారం చేయరాదని స్పష్టం చేశారు. మార్కెట్‌లోనే వ్యాపారులకు అనువైన ఏర్పాట్లు చేస్తామని, రోడ్డు విస్తరణ, డ్రైనేజీని అండర్‌గ్రౌండ్‌లోకి మార్చడం, ఫ్లైఓవర్ నిర్మాణం వంటి చర్యలతో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. మార్కెట్‌లో వ్యాపారం నిర్వహించే ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కష్టనష్టాల్లో బీమా అండగా ఉంటుందని, వ్యాపారులందరూ బీమా చేయించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. వ్యాపారులు తమ సమస్యలను స్థానిక కార్పొరేటర్, మేయర్, డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకురావాలని, తాను కూడా తరచూ మార్కెట్‌ను సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నగర అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించే నిబంధనలను వ్యాపారులు పాటించాలని కోరారు. మార్కెట్ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించిన మున్సిపల్ అధికారులు, కమిషనర్, స్థానిక కార్పొరేటర్, మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, నాయకులు, సిబ్బందికి ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్ పి వెంకటేష్,సిరాజ్ ఖాద్రీ, 58 వ డివిజన్ కార్పొరేటర్ ఎం అనురాధ చిన్న తో పాటు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ కమిషనర్ రామాంజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విద్యా రంగాల్లో మహబూబ్‌నగర్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

**- ప్రభుత్వ విప్ లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) : వైద్య, విద్యా రంగాల్లో మహబూబ్‌నగర్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతూ ప్రత్యేక కేంద్రంగా ఎదుగుతోందని ప్రభుత్వ విప్ లి యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఎఓఐ టిజి సిఓఎన్ 2026 , 11వ తెలంగాణ రాష్ట్ర ఈ ఎన్ టీ (జుచీ) కాన్ఫరెన్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకప్పుడు చిన్న పట్టణంగా ఉన్న మహబూబ్‌నగర్‌లో ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ ఏర్పాటుతో వైద్య రంగంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. నగరంలోని ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, టీచింగ్ హాస్పిటల్ ద్వారా వందలాది మంది రోగులకు వైద్య సేవలు అందుతున్నాయని, అన్ని ప్రధాన వైద్య విభాగాలతో సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందని, త్వరలో వెయ్యి పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కూడా అందుబాటులోకి రానుందని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మహబూబ్‌నగర్‌లో వైద్య రంగంతో పాటు విద్యా రంగ అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఇంజినీరింగ్ విద్యలో ఉన్న లోటును అధిగమించేందుకు తెలంగాణతో పాటు దేశంలోనే ప్రతిష్టాత్మకమైన సంస్థగా పేరున్న ట్రిపుల్ ఐటీ (IIIT) ను మహబూబ్‌నగర్‌కు తీసుకురావడంలో ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రస్తుతం ట్రిపుల్ ఐటీలో రెండో సంవత్సరం కొనసాగుతుండగా, సుమారు 400 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. నగరంలో ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయం, రెండు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు, రెండు డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అనేక జూనియర్ కళాశాలలు ఉన్నాయని వివరించారు. దీంతో మహబూబ్‌నగర్ ఇప్పటికే విద్యా హబ్‌గా మారిందని, భవిష్యత్తులో మరింతగా వైద్య హబ్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహబూబ్‌నగర్‌లో మరో ప్రభుత్వ మెడికల్ కాలేజీని తీసుకురావాలన్నది తన కల అని, ఇందుకోసం ప్రభుత్వం వద్ద తన వంతు ప్రయత్నం చేస్తానని యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నగరాన్ని విద్య, వైద్యం, రవాణా రంగాల్లో మరింత అభివృద్ధి చేసి మెగా సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. మహబూబ్‌నగర్ భౌగోళికంగా కూడా ఎంతో అనుకూలమైన ప్రాంతంలో ఉందని, కర్ణాటక సరిహద్దుకు సమీపంలో ఉండటంతో పాటు జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, రైల్వే మార్గాలతో మంచి అనుసంధానం కలిగి ఉందన్నారు. విమానాశ్రయం కూడా నగరానికి సుమారు 78 కిలోమీటర్ల దూరంలో ఉందని, భవిష్యత్తులో రాబోయే ఫ్యూచర్ సిటీ కూడా మహబూబ్‌నగర్‌కు సమీపంలోనే ఉంటుందని పేర్కొన్నారు. ఈ అన్ని అంశాలు నగరాన్ని భవిష్యత్తులో మెగా సిటీగా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని తెలిపారు. మహబూబ్‌నగర్



వైద్యుల సేవలను ప్రభుత్వ విప్ ప్రత్యేకంగా అభినందించారు. మహబూబ్‌నగర్‌లోని వైద్యులు పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ గొప్ప సేవ చేస్తున్నారని అన్నారు. గుల్బర్గా, రాయచూర్‌తో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా రోగులు మహబూబ్‌నగర్‌కు వచ్చి క్లిష్టమైన శస్త్రచికిత్సలు, వైద్య విధానాలను తక్కువ ఖర్చుతో పొందుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రులతో పోలిస్తే చాలా తక్కువ ఖర్చుతో ఇక్కడి వైద్యులు క్లిష్టమైన చికిత్సలు అందించడం అభినందనీయమన్నారు. మహబూబ్‌నగర్‌ను తమ సొంత ప్రాంతంగా భావించి వైద్య సేవలు అందిస్తున్న ప్రతి ఒక్క వైద్యుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వైద్య రంగంలో ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ తనదైన ముద్ర వేసిందని పేర్కొన్నారు. వైద్య రంగంలో తాజా ఆవిష్కరణలు, ఆధునిక చికిత్సా విధానాలపై చర్చించేందుకు తెలంగాణ రాష్ట్ర స్థాయి సదస్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వైద్యులు తమ అనుభవాలను పరస్పరం పంచుకోవడంతో పాటు కొత్త వైద్య విధానాలపై అవగాహన పెంపొందించుకునేందుకు ఇలాంటి సదస్సులు మంచి వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, నిర్వాహక కమిటీకి అభినందనలు తెలిపారు. సదస్సుకు హాజరైన ప్రతినిధులు, వైద్య నిపుణులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ సదస్సు విజయవంతంగా, చిరస్మరణీయంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా. ఎన్. వెంకట్రామిరెడ్డి, డా. పి. విజయానంద రెడ్డి, డా. కె. కృష్ణారెడ్డి, డా. కె.వి. జోషి. డా. హరిప్రసాద్, డా. రణ్‌బీర్ సింగ్, డా. జి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ మాటల నుంచి స్ఫూర్తి పొందవచ్చు : బెల్జియం ప్రధాని

మొదటి పేజీ తరువాయి

భారత ప్రధాని నరేంద్ర మోదీపై బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచంలో అత్యంత స్ఫూర్తిదాయకమైన నేతల్లో ప్రధాని మోదీ ఒకరని పేర్కొన్నారు. మోదీవి హేతుబద్ధమైన ఆలోచనలు అని కీర్తించారు. ఆయన చెప్పిన వాటిని మనం అనుసరించాలని పేర్కొన్నారు. మోదీ వివేకవంతమైన నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. ప్రధాని మోదీ.. తెలివైన నాయకుడని అభివర్ణించారు. శనివారం దేశ ఆర్థిక రాజధాని ముంబై వేదికగా భారత్ – యూరోపియన్ యూనియన్ (ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మాట్లాడుతూ.. భారత్‌లో పర్యటించడం గౌరవంగా ఉందన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో తాను సమావేశమయ్యానని పేర్కొన్నారు.





# ప్రజల కోసం, సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం నిర్వహిస్తాం: మాజీమంత్రి శీనన్న

## జీవో 97 ను ఎత్తివేయాలి విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీలో మాజీమంత్రి

(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) ప్రజల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం తాము రాజీలేని పోరాటం నిర్వహిస్తామని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హామీగా ప్రకటించారు శనివారం నాడు పాలమూరులో కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై నిర్వహించిన విద్యార్థుల భారీ నిరసన ర్యాలీలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటలు ప్రసంగం ఇలా కొనసాగింది. 14 లక్షల మంది విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.10 వేల కోట్లు బాకీ ఉంది.. ప్రభుత్వం ఇవ్వడం లేదని విద్యార్థులు ఫీజు కట్టి సర్టిఫికెట్ తీసుకెళ్లాలని కాలేజీ యాజమాన్యాలు చెబుతున్నాయి.పాలిటెక్నిక్ విద్యార్థులను రోడ్డుపై పడేశారు... ఇంజనీరింగ్ విద్యకు దూరం చేసే కుట్ర చేస్తున్నారు.. వెంటనే జీవో 97ను ప్రభుత్వం రద్దు చేయాలి.గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు.రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని మాట తప్పారు.. నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూస్తున్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన నియామక ప్రక్రియలో చివర నియామక పత్రాలు ఇచ్చి మేము ఉద్యోగాలు ఇచ్చామని కాంగ్రెస్ నాయకులుచెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని నియామక నోటిఫికేషన్లు ఇచ్చిందో యువతకు చెప్పాలి. విద్యార్థినులకు స్కూటీ ఇస్తామని ఇవ్వలేదు. ఆడపిల్లల పెళ్లిళ్లకు కల్యాణ లక్ష్మి అమలు చేయడం లేదు.. తులం బంగారం ఇవ్వలేదు. అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది.వెయ్యి పడకల ఆస్పత్రి భవనం పూర్తి చేశాము.. ఇప్పుడు వసతులు కల్పించి ప్రారంభించకుండా అలాగే భవనాన్ని ఉంచారు. చాలా మంది సకాలంలో వైద్యం అందక పేదలు చనిపోతున్నారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు పోరాటం కొనసాగుతుంది. అమర్ రాజా కంపెనీ తీసుకువచ్చి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాము. విద్యార్థులు చదువుకునేందుకు పెద్ద సంఖ్యలో గురుకుల విద్యాలయాలు తీసుకువచ్చాము.. వసతి గృహాలు కూడా తీసుకు వచ్చాము. కరెంటు సరిగ్గా ఇవ్వక గ్రామాల్లో పంటలు ఎండి రైతులు ఇబ్బంది పడుతున్నారు. యూరియా ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం నిర్వహిస్తామని హామీగా ప్రకటించారు. ఈ నిరసన ర్యాలీ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, సీనియర్ నాయకులు గిరిధర్ రెడ్డి, కట్ట రవికిషన్, కిషోర్ కుమార్, నవకాంత్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీశైలం, గిరిధర్ రెడ్డి, అనంత రెడ్డి, విద్యార్థి నాయకులు శివకుమార్, సుదీప్ రెడ్డి, నవీన్ రాజు, గణేష్, సత్యపాల్, మనీష్, అఖిల్, ప్రమోద్, రాకేష్, నీరాజ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులను నమ్మించి మోసం చేశారు



(సమయం ప్రతినిధి, వనపర్తి) : ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసిందని BRSV వనపర్తి జిల్లా అధ్యక్షుడు హేమంత్ ముదిరాజ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో వనపర్తిలో విద్యార్థులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంత్ ముదిరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులు, యువత సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన 2 లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి, విద్యార్థినులకు స్కూటీలు, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, యూత్ కమిషన్, రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ విద్యకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు రూ.25 లక్షల ఆర్థిక సాయం, విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల పెంపు, ఫీజు రీయిం బర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే GO 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హామీలన్నీ అమలు చేయాలి కార్యక్రమంలో BRSY వనపర్తి ఇన్‌చార్జి సూర్యవంశం గిరి, BRS సోషల్ మీడియా ఇన్‌చార్జి సునీల్ వాల్మీకి, శివ గౌడ్, సిరివాటి శంకర్, జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్,మాజీ కౌన్సిలర్ ఉంగులం తిరుమల్ తదితరులు మాట్లాడారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయడంతోపాటు యూత్ డిక్లరేషన్‌లోని హామీలన్నింటినీ నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా,అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేష్ గౌడ్, ప్రేమనాథ్ రెడ్డి, చిట్యాల రాము, గాలిగల్ల క్రాంతికుమార్, జీవీ ప్రసాద్, విజయ్ మోహన్, అలీమ్, జోయబ్ హుస్సేన్, యుగంధర్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, నాగరాజ్, బేధడి కుమార్, ఇమ్రాన్, మునికుమార్, అస్లాం, అఖిలేందర్, చంద్రశేఖర్, మంద రాము, రవి, సంతోష్‌తో పాటు, పట్టణ నాయకులు వివిధ మండల నాయకులు, పలు సర్పంచులు, పలువురు BRS, BRSV నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, యువజన నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే : ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి. సమయం ప్రతినిధి : విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు మరువలేనివని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు వారిలో క్రమశిక్షణ, విలువలు, సామాజిక బాధ్యత, నైతికత వంటి లక్షణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఒక విద్యార్థి జీవితంలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దుతూ సమాజ అభివృద్ధికి బాటలు వేస్తున్న ఉపాధ్యాయుల సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, స్పోర్ట్స్ స్కూల్స్ వంటి విద్యా సంస్థలు అందుబాటులోకి రావడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడా రంగంలో ప్రతిభను వెలికితీసే అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులలో నాణ్యమైన విద్యను పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.



మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న 55 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సన్మానించడం ద్వారా వారిలో మరింత ఉత్సాహం, బాధ్యత పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, జమీా ప్రతాప్ రెడ్డి, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండప నిర్వాహకులకు పోలీసుల అవగాహన సదస్సు శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలని సూచన

వేకువ సమయం సెప్టెంబర్ 5, కీసర ప్రతినిధి : కీసర: వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గణేష్ మండప నిర్వాహకులకు కీసర పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. జవహర్‌నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర సీఐ ఆంజనేయులు, ఎస్ఐలు జ్ఞానేందర్ రెడ్డి, శ్రీనివాస్ విద్యుత్ ఏఈ మురళి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండప నిర్వాహకులు, యువకులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. మండపాల వద్ద భద్రతా చర్యలు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అలాగే ఉత్సవాల సందర్భంగా పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సహకరించాలని అధికారులు కోరారు. అనుమానాస్పద పరిస్థితులు లేదా ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, శాంతియుత వాతావరణంలో విజయవంతంగా జరిగేలా మండప నిర్వాహకులు పోలీసులకు విద్యుత్ అధికారులకు సహకరించాలని అధికారులు కోరారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కూడా పోలీసుల సూచనలను పాటిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు.

## అనారోగ్య బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ అండ కోల నరసింహ యాదవ్‌కు రూ.60 వేల చెక్కు అందజేత

కీసర, సెప్టెంబర్ 5, సమయం ప్రతినిధి : చీర్యాల: అనారోగ్యంతో బాధపడుతున్న చీర్యాలకు చెందిన కోల నరసింహ యాదవ్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.60 వేల ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో చెక్కును నరసింహ యాదవ్‌కు అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసాగా నిలుస్తోందన్నారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా లభించే సహాయం వైద్య ఖర్చుల భారాన్ని కొంతమేర తగ్గిస్తుందని నాయకులు అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోల కృష్ణ యాదవ్, రామిడి విజయ్ రెడ్డి, తుంగ ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం-అభివృద్ధిలో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డి

మహబూబాబాద్ సెప్టెంబర్ 5 (వేకువ సమయం ప్రతినిధి): మహబూబాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహబూబాబాద్‌లో విజయోత్సవ బైక్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ అధ్యక్షత వహించారు. బైక్ ర్యాలీ అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యార్థులకు సంక్షేమ కార్యక్రమాలు వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.

# మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజ్ఞాపూర్ టు గజ్వేల్ వరకు భారీ ర్యాలీ పాల్గొన్న మంత్రి వివేక్, విహెచ్








(సమయం ప్రతినిధి హైదరాబాద్): గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి మరియు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష ఆధ్వర్యంలో భారీ మోటార్ బైక్ ర్యాలీ జరిగింది. మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) గజ్వేల్ ప్రజలకు దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమైన నేపథ్యంలో, ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగంపై ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తూ, కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజ్ఞాపూర్ నుండి గజ్వేల్ వరకు భారీ ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తుంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ: గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ నియోజకవర్గ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారానికి ఒకసారి గజ్వేల్‌లో సమావేశం నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకుంటానని హామీ ఇచ్చారని, అయితే ప్రస్తుతం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ఫామ్‌హౌస్ నుంచి బయటకు రాని గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ తమకు వద్దంటూ, గజ్వేల్ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేసీఆర్ వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా ప్రభుత్వ జీతభత్యాలు తీసుకుంటూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గజ్వేల్ ప్రాంత సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి వర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత రావు పాల్గొన్నారు.

## చిన్నచింతకుంటలో జోరందుకున్న అభివృద్ధి పనులు

### ఎంతోకాలం నిరీక్షణకు తెర.. 7వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల శుభారంభం
### తన వార్డు అభివృద్ధికి పట్టం కట్టిన 7వ వార్డు మెంబర్ 'షేరి గౌస్



దేవరకద్ర : చిన్నచింతకుంట మండల కేంద్రంలోని 7వ వార్డు ప్రజలు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఈరోజు గ్రామ పంచాయతీ నిధులతో పనులను ఘనంగా ప్రారంభించడం జరిగింది. MPO శ్యాంసుందర్ రెడ్డి గారు, గౌరవ సర్పంచ్ మానస దశరథ్. 7వ వార్డు మెంబర్ షేరి గౌస్ ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా ప్రారంభం వార్డు ప్రధాన సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేయించిన మెంబర్ షేరి గౌస్ కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటేష్ (దేవరకద్ర నియోజకవర్గ మాజీ యూత్ అధ్యక్షులు) మహమూద్ (మండల మాజీ కో-ఆప్షన్ సభ్యులు) ఎం.డి.జాకీర్ (మండల మాజీ కో-ఆప్షన్ సభ్యులు) జి.ప్రతాప్ (మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు) పి.వెంకటేష్ (గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు) దేవిశేఖర్ (8వ వార్డు మెంబర్) బత్తుల బాలకృష్ణ (11వ వార్డు మెంబర్) సి.సంతోష ఇస్సాకు (13వ వార్డు మెంబర్) హరీష్ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కొత్తకోటలో ఆల ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన ర్యాలీ






(సమయం ప్రతినిధి దేవరకద్ర) : వనపర్తి జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట పట్టణంలో విద్యార్థుల భారీ ర్యాలీ. జరిగింది. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ కదం తొక్కిన విద్యార్థులు... కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు ఇచ్చిన హామీలు గుర్తు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శన చేస్తూ...హామీలు అమలు చేయాలని విద్యార్థులు.. నినదించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ,అనంతరం నిర్వహించిన ధర్నాలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి శ్రీ,ఆల ప్రీతి రెడ్డి ,బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నాయి. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వారం రోజులపాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల్లో ఎండగడుతున్నాం. నిరసన ర్యాలీ,ధర్నాలు విజయ వంతం అవుతున్నాయి.. ప్రజలు కాంగ్రెస్ పై ఆగ్రహంగా ఉన్నారు అనడానికి ఇదే నిదర్శనం... వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలని తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది.. వెయ్యి రోజులైనా హామీల అమలు లేదు..ప్రజల్ని మోసం చేసి వెయ్యి రోజుల సంబరాలు చేసుకుంటున్నారు... ఆరు గ్యారెంటీలు,420 హామీల గురించి ప్రజలు తిరగబడే రోజులు వస్తాయి.. రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, స్కూటీలు, ఐదు లక్షల భరోసా కార్డు ఎప్పుడు ఇస్తారు.. విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారని రోడ్ల మీదకు వచ్చారు. విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలు చేపట్టింది.. హామీలు అమలు చేసే వరకు కాంగ్రెస్‌ను నిద్రపోనివ్వం. ప్రజల పక్షాన ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు.

## కృష్ణవేణికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



మహబూబాబాద్, సెప్టెంబర్ 5: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశిష్ట ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి కృష్ణవేణి చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. గత విద్యా సంవత్సరంలో కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. అలాగే పలువురు విద్యార్థులు ఎంసెట్, నీట్ వంటి ప్రవేశ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా మార్గనిర్దేశం చేసి, వారి ఉన్నత విద్యకు బాటలు వేశారు.ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రాంతీయ సమన్వయ అధికారి (ఆర్‌సీఓ) లక్ష్మీనారాయణ నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రమ్మ, ఉప ప్రిన్సిపాల్ చేతుల మీదుగా కృష్ణవేణికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందజేశారు.కృష్ణవేణికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించడంపై కళాశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మార్గదర్శి బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ్మగాని అరుణ్ కుమార్ ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తున్న కృష్ణవేణి మరెందరికో ఆదర్శంగా నిలిచారని పలువురు ప్రజాప్రతినిధులు ప్రశంసించారు.

## నాగారం జడ్పీహెచ్ఎస్, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

### ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి ఎంతో కీలకం: మాజీ చైర్మన్ చంద్రారెడ్డి




వేకువ సమయం, సెప్టెంబర్ 5, కీసర ప్రతినిధి : నాగారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగారం జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం లో ఉపాధ్యాయుల పాత్రను గుర్తిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం గౌరవప్రదంగా సాగింది. ఈ సందర్భంగా రెండు పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న సుమారు 40 మంది ఉపాధ్యాయులను నాగారం మాజీ చైర్మన్ శ్రీ చంద్రారెడ్డి శాలువాలతో సన్మానించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు సమాజానికి అందిస్తున్న సేవలను కొనియాడారు. ప్రత్యేకంగా నాగారం ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయురాలు కళావతి మేడం ఉత్తమ జిల్లా అవార్డుకు ఎంపిక కావడం పట్ల చంద్రారెడ్డి అభినందనలు తెలిపారు. విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించినందుకు ఆమెను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. విద్య ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని, మంచి విద్య సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, జ్ఞానం, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా విద్యార్థులకు మంచి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని, వారి కృషి వల్లే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు, హెచ్ఎం రాములు సార్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరినీ శాలువాలతో ఘనంగా సన్మానించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## కేసీఆర్ 1000 రోజులు ఫామ్‌హౌస్‌కే పరిమితం: వజ్రేష్ యాదవ్



### ప్రతిపక్ష నేత పదవికి వెంటనే రాజీనామా చేయాలి

వేకువ సమయం సెప్టెంబర్ 5 కీసర ప్రతినిధి : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, కీసర : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం ఈసీఐఎల్ ఎక్స్ రోడ్‌లో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పర్మేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. "1000 రోజులుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు.. ప్రజల మధ్య ఒక్కరోజు కూడా లేరు" అని విమర్శించారు. పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో ప్రజా సమస్యలను పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందని వజ్రేష్ యాదవ్ అన్నారు. అయితే ప్రజలకు అందుబాటులో లేకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత పదవిలో కొనసాగేందుకు నైతిక హక్కు లేదని, వెంటనే ఆ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు మరింత పెరుగుతుందని వజ్రేష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళా నాయకులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 22-ఏ భూముల సమస్యపై బీజేపీ మహాధర్నా




కీసర, సెప్టెంబర్ 5, సమయం ప్రతినిధి : కీసర రైతులు, పేదలు, భూ యజమానులు ఎదుర్కొంటున్న 22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, భూ యజమానులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ మహాధర్నాకు కీసర డివిజన్-1 బీజేపీ అధ్యక్షుడు కోల బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో కీసర ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. 22-ఏ జాబితాలో అక్రమంగా చేర్చిన భూములను వెంటనే ఆ జాబితా నుంచి తొలగించి, ఏళ్ల తరబడి భూములపై హక్కులు ఉన్న రైతులు, భూ యజమానులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. 22-ఏ జాబితాలో భూములు చేరడంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, ఇతర లావాదేవీల విషయంలో భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తమ భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించి హక్కులను పరిరక్షించాలని బాధితులు కోరుతున్నారని తెలిపారు.

**బాధితులకు అండగా ఉంటా: ఈటల రాజేందర్**

మహాధర్నాలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. మేడ్చల్ ప్రాంతంలో 22-ఏ భూముల సమస్యతో బాధపడుతున్న వారందరికీ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బాధితులకు విముక్తి కల్పించే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని, అవసరమైతే ప్రభుత్వాన్ని మెడలు వంచైనా న్యాయం సాధిస్తామని ఆయన అన్నారు. తన పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు అండగా ఉంటానని భరోసా ఇస్తూ.. "నా పార్లమెంట్ పరిధిలో ఏ ఒక్కరి కాలికైనా ముళ్లు విరిగితే, నా పంటితో ఆ ముళ్లను తీసే వ్యక్తిత్వం నాది" అని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. ప్రజలు, రైతులు, భూ యజమానుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని తెలిపారు.

**బీజేపీ ప్రధాన డిమాండ్లు**

22-ఏ జాబితాలో అక్రమంగా చేర్చిన భూములను వెంటనే తొలగించాలి. రైతులు, పేదలు, భూ యజమానులకు న్యాయం చేయాలి. భూముల రిజిస్ట్రేషన్లపై ఉన్న సమస్యలను పరిష్కరించాలి. బాధితుల భూ హక్కులను పరిరక్షించాలి. 22-ఏ భూముల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు.








# మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 5 :** మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ సొంత కాళ్లపై నిలబడేలా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. మహిళా సంఘాలను కేవలం పొదుపు, రుణ కార్యకలాపాలకే పరిమితం చేయకుండా, వివిధ రంగాల్లో వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని చెప్పారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పెద్ద కొత్తపల్లి, కొల్లాపూర్ మండలాల పరిధిలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ లతో కలిసి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళ శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క రోడ్డు, సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు పనులను శంకుస్థాపన చేశారు. అనంతరం కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని రాజా గారి బంగ్లా ఆవరణలో 1000 రోజు ప్రజా ప్రభుత్వం పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో

## మంత్రి సీతక్క మాట్లాడుతూ.....

మహిళలకు నిరంతరం పని కల్పించేలా ప్రభుత్వ కార్యక్రమాల్లో వారికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల యూనిఫాంలు, పాఠశాల విద్యార్థుల యూనిఫాంలు తదితర పనులను మహిళా సంఘాల సభ్యులకు అప్పగిస్తూ వారికి ఉపాధి కల్పిస్తున్నామని,ఈ విధంగా మహిళా సంఘాల సభ్యులకు స్థిరమైన ఆదాయ మార్గాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కార్యక్రమం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో రూ.2.53 కోట్ల మేర కమిషన్ ఆదాయం మహిళా సంఘాలకు లభించిందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో మహిళా సంఘాలను భాగస్వాములను చేయడం ద్వారా వారికి ఉపాధితో పాటు ఆదాయ అవకాశాలను కూడా కల్పిస్తున్నామని చెప్పారు.ప్రతి మహిళ ఏదో ఒక వ్యాపారం లేదా స్వయం ఉపాధి కార్యక్రమంలో భాగస్వామి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళలు ఇంటి పరిధికే పరిమితం కాకుండా బయటకు వచ్చి ఆర్థిక కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొని తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని సూచించారు.మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసే అవకాశాలను కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఉత్పత్తి చేసిన విద్యుత్తును స్వయంగా వినియోగించుకోవడంతో పాటు మిగులు విద్యుత్తును విక్రయించడం ద్వారా మహిళా సంఘాలకు నెలకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు.మహిళ ఆర్థికంగా, సామాజికంగా సంతోషంగా ఉంటే కుటుంబం బలోపేతం అవుతుందని, కుటుంబాలు బాగుంటే గ్రామాలు, తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మంత్రి సీతక్క తెలిపారు. మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళా సంఘాల సమావేశాలు, కార్యకలాపాల నిర్వహణకు గతంలో సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదురయ్యేవని మంత్రి గుర్తుచేశారు. ప్రస్తుతం మహిళా సంఘాలకు ప్రత్యేకంగా ఇందిర మహిళా శక్తి భవనాలు నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలు తమ సమావేశాలను, కార్యక్రమాలను సొంత భవనాల్లో నిర్వహించుకునేలా మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లా కేంద్రంలో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో ఇందిర మహిళా శక్తి భవనం, జిల్లా కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి వివరించారు. మహిళలు ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు రవాణా సౌకర్యం కూడా కీలకమని మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేసినట్లు గుర్తుచేశారు. మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగడంతో పాటు సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి, వారికి నిరంతర ఆదాయ మార్గాలు కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీతక్క తెలిపారు.






## రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ....

కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనతో పాటు రైతులు, మహిళలు, పేదలు, విద్యార్థులు, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తోందని,తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గౌరవిస్తూ సోనియా గాంధీ నేతృత్వంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందని మంత్రి గుర్తుచేశారు. ప్రజల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వానికి మరోసారి అవకాశం లభించిందని, ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.కొల్లాపూర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ పరిధిలోని రహదారుల అభివృద్ధికి సుమారు రూ.500 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అదనంగా మరో రూ.100 కోట్లతో రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు సుమారు రూ.50 కోట్లతో విద్యుత్ సంబంధిత పనులు కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సుమారు 2,500 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా జెట్‌పోల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులకు సుమారు రూ.200 కోట్ల వ్యయం అవుతోందని, పనులను వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించి పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యా వ్యయాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలను తల్లిదండ్రులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు, రైతు సంఘాలు, యువజన సంఘాలు విద్యపై చర్చించి విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు సహకరించాలని కోరారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడంతో పాటు సోలార్ యూనిట్లు, ఆర్టీసీ బస్సులు వంటి కార్యక్రమాల ద్వారా మహిళలకు స్వయం ఉపాధి, ఆదాయ అవకాశాలను కల్పిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో పర్యాటక రంగానికి ఉన్న అవకాశాలను వినియోగించుకునేలా టూరిజం శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. ఎంఆర్‌ఓ కార్యాలయ భవనాలతో పాటు మండలాల వారీగా సాంస్కృతిక భవనాలు, స్పోర్ట్స్ స్టేడియాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు.అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కో ఇంటికి రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు అప్పుల భారం పడకుండా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు.డ్రగ్స్ నిర్మూలనతో పాటు వివిధ సామాజిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచడంతో పాటు ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవన విధానం వైపు నడిపించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని చెప్పారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ‘ప్రభాతభేరి’ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రజలు తమ ఆదాయానికి అనుగుణంగా ఖర్చులు చేసుకుంటూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని మంత్రి సూచించారు. విద్య, వైద్యం, సామాజిక కార్యక్రమాలు, ఫంక్షన్ల పేరుతో అవసరానికి మించి ఖర్చు చేయడం కుటుంబాలు అప్పుల పాలవడానికి ప్రధాన కారణాల్లో ఒకటని పేర్కొన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలను పరిమిత వ్యయంతో నిర్వహించుకోవాలని సూచించారు. అనవసర ఖర్చులను నియంత్రించి పొదుపు అలవాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్ అవసరాలకు ఆర్థిక భద్రత కల్పించుకోవచ్చన్నారు.ఆరోగ్యంపై ముందస్తుగా శ్రద్ధ వహించడం ద్వారా భవిష్యత్‌లో వైద్య ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని మంత్రి తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామం, యోగా, ధ్యానం, ఈత వంటి శారీరక, మానసిక ఆరోగ్య కార్యకలాపాలకు కేటాయించాలని సూచించారు.ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా కుటుంబాలు అనవసర వైద్య వ్యయాలకు గురికాకుండా ఆర్థికంగా కూడా స్థిరంగా ఉండవచ్చని మంత్రి పేర్కొన్నారు.సెల్‌ఫోన్, సోషల్ మీడియాను కేవలం వినోదానికి మాత్రమే పరిమితం చేయకుండా విద్య, విజ్ఞానం, నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధి, వ్యాపార అవకాశాలను తెలుసుకునేందుకు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు.యువతతో పాటు మహిళలు కూడా డిజిటల్ వేదికలను ఉపయోగించుకుని కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని, ఉపాధి, వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. కుటుంబ ఆదాయానికి అనుగుణంగా ఖర్చులకు ప్రాధాన్యతనిస్తూ, అనవసర వ్యయాలను నియంత్రించి పొదుపు చేయడం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని సాధించవచ్చని తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో రహదారులు, విద్యుత్, విద్య, పర్యాటకం, క్రీడలు, గృహ నిర్మాణం, మహిళా సాధికారత తదితర రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.

## ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.....

కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎంతో చైతన్యవంతులని, స్థానిక సమస్యలతో పాటు రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ అంశాలపై అవగాహనతో చర్చించే సామర్థ్యం వారికి ఉందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి అన్నారు. కొల్లాపూర్ ప్రాంత అభివృద్ధిలో జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యేగా, మంత్రిగా కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడం ఆయన ప్రత్యేకత అని చెప్పారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చైతన్య కళా ప్రదర్శన ద్వారా కుటుంబ ఆర్థిక స్థిరత్వం, పొదుపు, బాధ్యతాయుత జీవనం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమని ఎంపీ అన్నారు. ప్రజల్లో సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన పెంచే ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలు, అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా పాలన అందించే ప్రభుత్వం రాష్ట్రంలో పనిచేస్తోందని మల్లు రవి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందించడం ద్వారా ఆహార భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోందని చెప్పారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ రాష్ట్రంలో కుల గణన నిర్వహించి వివిధ వర్గాల జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర వివరాలను సేకరించామని ఎంపీ వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న చర్యలు సామాజిక న్యాయ సాధనలో కీలకమైనవని తెలిపారు. మహిళలు, రైతులు, యువత, పేదలు, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రైతుల సంక్షేమంతో పాటు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన నిధులు, ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీ మల్లు రవి తెలిపారు. సాగునీరు, రవాణా తదితర రంగాల్లో రాష్ట్ర అవసరాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను సాధించేందుకు సమన్వయం కొనసాగుతోందన్నారు. ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధిని సమన్వయం చేస్తూ తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం కొల్లాపూర్ నియోజక వర్గంలో మహిళా సంఘాలకు 175 కోట్లు రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు.నియోజకవర్గం పరిధిలోని మండలాల మహిళా సంఘాల ఆధ్వర్యంలోని సంఘాల కు గొర్రె పిల్లను, నాటుకోడి పిల్లలను పంపిణీ చేశారు.అంతకుముందు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు తెలంగాణ సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆడంబరాలకు పోయి అప్పుల పాలు కావద్దు అనే అంశంపై నాటికను ప్రదర్శించిన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఆర్డీవో బన్సీలాల్, కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి,సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కోనేరు ఎన్జీవో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 5: నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని కోనేరు ఎన్జీవో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంజీ నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం రోజు ఉపాధ్యాయులను గౌరవించడం స్వచ్ఛంద సంస్థ గుర్తించి సన్మానం చేయడం చాలా సంతోషకరమని అన్నారు. సంస్థ చేస్తున్న కార్యక్రమాలు ఎంతో ప్రాముఖ్యత బాల కార్మికులు , బాల్య వివాహాలు, అక్రమ రవాణా, పిల్లలపై లైంగిక వేధింపులు, తదితర విషయాలపై గత 25 సంవత్సరాల నుండి పనిచేస్తుందని కొనియాడారు. పాఠశాలలో డ్రాపోర్టు పిల్లలకు ఇంట్లో దగ్గరికి వెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించి వారిని స్కూల్ కి వచ్చే విధంగా చేస్తున్నారు. అదేవిధంగా ముందుగానే బాల్య వివాహం చేసుకోరాదని గ్రామాలలో ప్రచారం నిర్వహిస్తూ. గ్రామపంచాయతీలలో బాలల సౌరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి అన్ని శాఖలతో చర్చించడం జరుగుతుంది. గ్రామంలో ఎక్కడ కూడా బాల్య వివాహ రహిత గ్రామంగా ఇదే విధంగా గ్రామస్థాయిలో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. ఇదేగాక గ్రామాలలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలు ఈ ప్రాంతం నుండి ఇతర ప్రాంతాలకు తీసుకు వెళ్ళకుండా వారిని స్థానికంగా ఉన్న పాఠశాలలో లేదా హాస్టల్లో వసతి కల్పించి విద్యలు అందించే దిశగా కృషి చేస్తున్నారు. ఎంతోమంది గ్రామీణ ప్రాంతాలలో వెనుకబడిన పిల్లలకు రక్షణగా ఉంటూ వారికి పై చదువుల కోసం వివిధ వసతి గృహాలలో చేర్పించి విద్య లో ముందుకు వెళ్లే విధంగా కృషి చేస్తున్నారు. సంస్థ చేస్తున్న కార్యక్రమాలు ఎంతో ప్రజలకు ఆకట్టుకుంటున్నాయి. అందులో భాగంగా ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఉపాధ్యాయులను గౌరవించడం కోసం కోనేరు సంస్థ ఉపాధ్యాయులందరికీ శాలువాలతో సత్కరించడం చాలా సంతోషమని ప్రధానోపాధ్యాయులు రామ్ జి నాయక్ తెలిపారు. ఒక్కొక్క ఉపాధ్యాయులకు బోకే ఇస్తూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోనేరు సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు. ఏరియా కోఆర్డినేటర్ జాకీర్ హుస్సేన్. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కాజా సలాం, ఉపాధ్యాయ బృందం ఆనంద్ ప్రసాద్, ప్రణీత ,స్వర్ణలత సత్యనారాయణ శీను ఆనంద్ బాబు లక్ష్మణ్ వేణుగోపాల్ రవిశంకర్ సంధ్యారాణి విజయ గోపాల్ రెడ్డి అజిత్ బేగం లిఖిత్ బేగం అఫ్రి బేగం శివ కుమార్, శిరీష పి ఈ టి, నాగేంద్రం, రజిత వంశీ జ్యోతి గాన్సిరాం రాథో, కాజా సలీం, తదితరులు పాల్గొన్నారు

# 1000 కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

### రెడ్డి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండకింది మాధవరెడ్డి

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 5 : ఈనెల 8న హాలో రెడ్డి చలో ఇందిరా పార్కు అనే నినాదంతో హైదరాబాదులోని ఇందిరాపార్కు దగ్గర ధర్నా నిర్వహిస్తున్నట్లు. రెడ్డి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండకింది మాధవరెడ్డి తెలిపారు. 1000 కోట్లతో రెడ్డి కార్పొరేషన్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని రైతు భీమా అనే ప్రభుత్వం కొనసాగించాలని, రైతు బీమాని ప్రభుత్వం కొనసాగించాలని అదేవిధంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ప్రభుత్వం అన్ని విభాగాల్లో అమలు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన ధర్నాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ ధర్నాను ప్రతి ఒక్క రెడ్డి బిడ్డ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.






# భూభారతి శ్రీ ధర్నాలో పాల్గొన్న పాలమూరు ఎంపీ అరుణమ్మ

హైదరాబాద్ : భూ భారతి సమస్యలపై శనివారం హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద తెలంగాణ బీజేపీ నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమంలో శ్రీ. డీకే. అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ BRS పదేళ్ల పాలనలో బంగారు తెలంగాణ అని తెలంగాణ ప్రజలను మోసం చేసి.. ఒక కుటుంబం మాత్రమే బంగారు కుటుంబంగా మారింది. కేసీఆర్, ఆయన కుటుంబం పై కోపంతో తెలంగాణలో కాంగ్రెస్ కి అధికారం ఇచ్చారు. కానీ ఎలాంటి పనులు చేయకుండా, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వెయ్యి రోజుల పాలన అని ఏదో ఉద్ధరించినట్లు సంబరాలు చేసుకుంటున్నారు. దీనికి కొంచెమైనా సిగ్గు అనిపించడం లేదా.. ఫీజు రీయింబర్స్మెంట్ చేయకుండా విద్యార్థుల కుటుంబాలను క్షోభకు గురిచేస్తుంది. పట్టదారుల భూములను దోపిడీ చేసే కుట్ర కాంగ్రెస్ చేసింది. నాడు ధరణి పేరుతో భూములు కుల్లగొడితే.. నేడు భూ భారతి తో కాంగ్రెస్ కొత్త పన్నగంతో భూములు దోచుకుంటుంది. పిల్లల పెళ్లిళ్లకు, కష్టం వచ్చిందనో, అవసరానికో భూమి అమ్ముకోవాలంటే.. నేడు అమ్ముకునే పరిస్థితి లేదు. తోలు తినేటోడు పోయి.. తోలు, బొక్కలు తినేటోడు వచ్చిండు. 22A లో ఉన్న పట్టా భూములు వెంటనే తొలగించాలి. బీజేపీ భయంతో అసెంబ్లీ సమావేశాలు కేవలం రెండురోజులు మాత్రమే నిర్వహిస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రులు అవినీతిలో ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. అవినీతి పరులను ఏరివేసి, తగిన బుద్ధి చెప్పే రోజులు రాబోతున్నాయి. కాంగ్రెస్ హామీలు కాగితాలకే పరిమితం తప్ప చేసింది ఏం లేదు. కాంగ్రెస్ కి గుణపాఠం చెప్పేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. బీజేపీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, దోపిడీలో.. బిఆర్ఎస్ ను మించిపోయింది. అసెంబ్లీ సమావేశాలలో 22A నిషేధిత జాబితాలో నుంచి పట్టా భూములు తొలగిస్తున్నామని ప్రకటన చేయండి. లేదంటే.. మిమ్మల్ని బయట తిరగనివ్వం. మీరు చేయకపోతే బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిషేధిత జాబితాలోని పట్టా భూములు తొలగిస్తామని రైతులకు బీజేపీ హామీ ఇస్తుంది. 22A బాధితులు ఎవరు ధైర్యం కోల్పోవద్దు, మీకు బీజేపీ అండగా ఉంది. ఈ మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న మహబూబ్ నగర్ పార్లమెంట్ కన్వీనర్ పవన్ కుమార్ రెడ్డి , యువ నాయకురాలు డీకే స్నిగ్ధ రెడ్డి , గద్వాల జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ వెంకట్రాములు , రామచంద్రారెడ్డి , బంగ్లా లక్ష్మీకాంతరావు , కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి , ఉమేష్, నవీన్ , కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







## జర్నలిస్టుల ప్రొటెక్షన్ యాక్ట్ కోసం అసెంబ్లీలో ప్రస్తావిస్తా: జిఎంఆర్

### భూత్పూర్ లో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన టీయూడబ్ల్యూజే (ఐజేయు) మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు

మహబూబ్ నగర్ (సెప్టెంబర్ 5): ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని, వారికి ప్రత్యేక రక్షణ చట్టం (జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్) తెచ్చే విధంగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పుతానని దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి హామీ ఇచ్చారు.మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా నాయకులు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ఉన్న విలేకరులపై తరచూ జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. గతంలో తెచ్చిన 'అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్' తరహాలోనే జర్నలిస్టుల భద్రతకు కూడా చట్టం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయాన్ని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు కాటం నాగరాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి, కోశాధికారి జిల్లాల రఘు, వార్త వేదిక ఎడిటర్ చంద్రశేఖర్ గౌడ్, చిక్కా వెంకట్, గోకులం వెంకటేష్, దేవరకద్ర నియోజకవర్గ అధ్యక్షుడు యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ ను తేలిగ్గా తీసుకోవద్దు

### జిల్లా న్యాయమూర్తి కే మురళి మోహన్

మహబూబాబాద్ సెప్టెంబర్ 5 (వేకువ సమయం ప్రతినిధి): వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించి సమాజంలో శాంతి స్థాపనకు అనువైన సులభమైన లోక్ అదాలత్ ప్రక్రియను తేలిగ్గా తీసుకోవద్దని మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. మురళి మోహన్ అన్నారు. శనివారం మూర్తి తొర్రూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, న్యాయమూర్తి పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో దృశ్య మాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించారు. లా అండ్ ఆర్డర్ స్థాపన అన్నివేళలా కేవలం శిక్ష ద్వారానే సాధ్యం కాదని, ఇరుపక్షాల మధ్య రాజీ కుదుర్చడం ద్వారా శాశ్వత శాంతిని నెలకొల్పవచ్చని ఇందుకు లోక్ అదాలత్ అత్యుత్తమ వేదిక అని ఆయన అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ నుండి సుశిక్షితులైన సిబ్బందిని నియమించి రాజీ కోసం ఇరుపాక్షాలతో కౌన్సిలింగ్ నిర్వహించవలసిందిగా సూచించారు. పోలీసు వారు కేసు నమోదు చేసేటప్పుడు అప్పటి పరిస్థితుల దృష్ట్యా నమోదు చేసిన సెక్షన్లని తగు విధముగా చట్ట పరిధిలో సవరించి కేసుల పరిష్కార ప్రక్రియని వేగవంతం చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రాజీ ప్రక్రియకు సంబంధించి గౌరవ సుప్రీంకోర్టు మరియు హైకోర్టులు ఇచ్చిన తీర్పులను వుంట0కించారు. తొర్రూరు పరిధిలో న్యాయశాఖ, పోలీసు శాఖ, ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేసి సెప్టెంబర్ 12 జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్య లో పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ శబరీష్ అత్యధిక కేసుల పరిష్కారం పై ఇచ్చిన హామీని న్యాయమూర్తి గుర్తు చేశారు. కార్యక్రమంలో తొర్రూరు మెజిస్ట్రేట్ డి. ధీరజ్ కుమార్, డి. ఎస్. పి. కృష్ణ కిషోర్, సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేవతి దేవి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## చంద్ర నాయక్ తండా గ్రామపంచాయతీలో ఆటోమేటిక్ వీధిలైట్ల వ్యవస్థ ఏర్పాటు

సమయం ప్రతినిధి : చంద్ర నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని తుక్యా నాయక్ తండా మంగ నాయక్ తండా, దీప్లా నాయక్ తండా గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం వీధిలైట్లకు ఆటోమేటిక్ ఆన్--ఆఫ్ స్విచ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థతో వీధిలైట్లు నిర్ణీత సమయంలో ఆటోమేటిక్‌గా ఆన్, ఆఫ్ అయ్యేలా ఏర్పాటు చేయడంతో విద్యుత్ ఆదా కావడంతో పాటు రాత్రి వేళల్లో గ్రామాల్లో మెరుగైన వెలుతురు అందుబాటులోకి రానుంది. తుక్యా నాయక్ తండాలో ఆటోమేటిక్ వీధి లైట్ల ఆన్ – ఆఫ్ బటన్ ను ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణ నాయక్ ఉపసర్పంచ్ సుజాత మహేష్ 5వ వార్డు మెంబర్ నిర్మలా కృష్ణ నాయక్.7వ వార్డు మెంబర్ వి రుక్కమ్మ.హరీష్ నాయక్. ఎమ్ రవి నాయక్ కృష్ణ నాయక్. బొజ్యా నాయక్.లోకేష్ నాయక్ పాల్గొన్నారు. మంగ నాయక్ తండాలో ఆటోమేటిక్ వీధిలైట్ల ఆన్–ఆఫ్ బటన్‌ను ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీ కృష్ణ నాయక్, ఉపసర్పంచ్ సుజాత మహేష్ నాయక్, మంగ నాయక్, హనుమంతు నాయక్, శంకర్ నాయక్, సక్రియ నాయక్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. దీప్లా నాయక్ తండాలో కూడా ఆటోమేటిక్ వీధిలైట్ల ఆన్–ఆఫ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

## శ్రావణమాసం చివరి శనివారం తిరుమలయ్యగుట్టపై పటిష్ఠ పోలీసు బందోబస్తు వనపర్తి రూరల్ ఎస్సై

వనపర్తి, సెప్టెంబర్ 05: శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా శ్రీ తిరుమల వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు తిరుమలయ్యగుట్టకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, ఆదేశాల మేరకు వనపర్తి రూరల్ ఎస్సై హృషికేష్ ఆధ్వర్యంలో పటిష్టమైన ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించారు. శ్రావణమాసంలో ప్రతి శనివారం తిరుమలయ్యగుట్టకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ తిరుమల వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుంటారు. శ్రావణమాసం చివరి శనివారం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగిన నేపథ్యంలో ఆలయ పరిసరాలు, మెట్ల మార్గాలు, క్యూ లైన్లు, భక్తుల రాకపోకల ప్రాంతాలు, వాహనాల రద్దీ, పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.భక్తుల రద్దీని క్రమబద్ధీకరిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వనపర్తి రూరల్ ఎస్సై హృషికేష్ స్వయంగా బందోబస్తు ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, భక్తుల రాకపోకలు, క్యూ లైన్ల నిర్వహణ, వాహనాల కదలికలు, పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు.వృద్ధులు, మహిళలు, చిన్నారుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచిస్తూ, భక్తులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. వృద్ధ భక్తురాలికి అండగా నిలిచిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు భక్తుల భద్రతతో పాటు మానవీయతకు కూడా ప్రాధాన్యత ఇస్తూ పోలీసులు తమ విధులను నిర్వర్తించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన ఓ వృద్ధ భక్తురాలు మెట్లు ఎక్కే క్రమంలోఇబ్బందిపడుతుండటాన్ని అక్కడే బందోబస్తు విధుల్లో ఉన్న పానగల్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు గమనించారు. వెంటనే స్పందించిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు వృద్ధ భక్తురాలికి సహాయం అందించి, ఆమెను క్షేమంగా ఎత్తుకొని మెట్ల మార్గం నుంచి కిందికి తీసుకువచ్చి సురక్షితంగా సహాయం చేశారు. విధి నిర్వహణలో భాగంగా చూపిన ఈ మానవీయ స్పందన అక్కడున్న భక్తుల ప్రశంసలను అందుకున్నారు. పోలీసుల విధి



కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాదు.. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలవడం కూడా మా బాధ్యతే" అన్న సందేశాన్ని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తన సేవతో చాటిచెప్పారు. వేలాది మంది భక్తులు తిరుమలయ్యగుట్టకు తరలివచ్చినప్పటికీ పోలీసు సిబ్బంది సమన్వయంతో, పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించారు. ముందస్తు భద్రతా చర్యలు, ప్రత్యేక బందోబస్తు, నిరంతర పెట్రోలింగ్, ట్రాఫిక్ నియంత్రణతో పాటు భక్తులకు అవసరమైన సహాయ సహకారాలు అందించారు. పటిష్టమైన బందోబస్తు, సమర్థవంతమైన పర్యవేక్షణ, నిరంతర పెట్రోలింగ్, మానవీయ దృక్పథంతో చేపట్టిన భద్రతా చర్యల ఫలితంగా శ్రావణమాసం చివరి శనివారం శ్రీ తిరుమల వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి తరలివచ్చిన వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎలాంటి సంఘటనలు, అపశృతులు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా మరియు విజయవంతంగా ముగిసిందని ఎస్సై తెలిపారు.

## దద్దరిల్లిన ర్యాలీ విద్యార్థులు, యువత సమస్యల పరిష్కారం కోసం భారీ ప్రదర్శన

కీసర, సెప్టెంబర్ 5, సమయం ప్రతినిధి : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా: విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీకి భారీగా తరలివచ్చిన యువత నినాదాలతో ప్రాంతం మార్మోగింది. ECIL X రోడ్ (రౌండ్ బిల్డింగ్) నుంచి రాధిక X రోడ్ వరకు ర్యాలీ కొనసాగింది. విద్యార్థుల రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ యువత కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, ఎన్నికల సమయంలో ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని పాల్గొన్న వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థులు, యువతకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగ యువతకు భవిష్యత్తుపై భరోసా కల్పించేందుకు జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేసి, ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, యూత్ డిక్లరేషన్‌లోని అంశాలను కార్యరూపంలోకి తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా ప్రభుత్వం చర్యలు




తీసుకోవాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించాలని నాయకులు కోరారు. ర్యాలీలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు, విద్యార్థులు, నిరుద్యోగ యువత, యువజన నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, యువ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "విద్యార్థుల హక్కుల కోసం.. యువత భవిష్యత్తు కోసం.. హామీల అమలు కోసం ఐక్యంగా పోరాడుదాం" అంటూ పాల్గొన్న వారు పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది.

# నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి





(సమయం ప్రతినిధి మహబూబ్నగర్) : నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఓఅండ్ఎం వర్క్ ప్లాన్ నిధుల కింద రూ.17.70 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నాణ్యత నియంత్రణ మరియు తనిఖీ ఉప విభాగం--1 కార్యాలయ భవనాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా అధికారులు, సిబ్బంది మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉంటుందని అన్నారు. నీటిపారుదల రంగ అభివృద్ధి, ఆయకట్టు విస్తరణతో పాటు నాణ్యత ప్రమాణాల పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, నాయకులు మైత్రి యాదయ్య, నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంవీఎస్ కళాశాలను తెలంగాణలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా



మహబూబ్‌నగర్ : ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అన్ని హంగులతో కూడిన అత్యుత్తమ విద్యాసంస్థగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించి, మాట్లాడుతూ వేలాది మంది శాస్త్రవేత్తలు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులను అందించిన ఘనత ఎంవీఎస్ కళాశాలకు ఉందన్నారు. 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ కళాశాలను సుమారు 70 కోట్లతో సమగ్ర ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించామని, అందులో భాగంగా తొలి విడతగా 20.50 కోట్లతో నేడు శంకుస్థాపన, భూమిపూజ చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన ?50 కోట్లను కూడా దశలవారీగా సమకూర్చి కళాశాలను తెలంగాణలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం కళాశాలలో సుమారు 3 వేల 5వందల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బ్యాంకింగ్ సర్వీసెస్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, సివిల్ సర్వీసెస్ తదితర ఉద్యోగ, పోటీ పరీక్షలకు ఉపయోగపడే కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అదేవిధంగా బాలికల కోసం హాస్టల్ నిర్మాణం, కళాశాల గ్రౌండ్ అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. ఎంవీఎస్ జూనియర్ కళాశాలలో 15 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలో ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యా సదుపాయాలను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. చిన్నారుల నుంచి డిగ్రీ, పీజీ విద్యార్థుల వరకు వేలాది మందికి నాణ్యమైన విద్య అందించేలా మొత్తం ఎంవీఎస్ ప్రాంగణాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని, రాబోయే మూడు, నాలుగు సంవత్సరాల్లో అత్యాధునిక మౌలిక వసతులతో అద్భుతమైన విద్యాసంస్థగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మీడియా కన్వీనర్ సిజె బెనహర్, కార్పొరేటర్లు గుముడాల రాధ గోవర్ధన్ గౌడ్, రమేష్ బాబు, కిషన్ నాయక్, రమేష్ రెడ్డి, ఫక్రు , ఎస్ శేఖర్, మేగ్యా నాయక్, తాహేర్, విట్టల్ రెడ్డి, అనుప ఆంజనేయులు, భాను చందర్ , సోషల్ మీడియా ఇంచార్జ్ ఏర్పుల నాగరాజు, నాయకులు మైత్రి యాదయ్య, వాల్డాస్ ప్రతాప్ గౌడ్, చంద్రమౌళి, అబ్దుల్ హక్, నరేష్, మోయిజ్ , కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, మున్సిపల్ కమిషనర్ రామాంజుల రెడ్డి ఇఇ కె.రాంచంద్రం, డిఇఇ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్-చెన్నై బుల్లెట్ రైలును సూర్యాపేట మీదుగానే నడపాలి

**లక్ష్మణ్‌కు వినతిపత్రం సమర్పించిన మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు**
**జాతీయ రహదారి 65 (NH 65)కు సమాంతరంగా బుల్లెట్ రైలు అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్**
**కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్న రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్**

హైదరాబాద్: శంషాబాద్ - చెన్నై హైస్పీడ్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ (Shamshabad-Chennai Bullet Train Project) అలైన్‌మెంట్‌ను మార్చకుండా, పాత ప్రతిపాదన ప్రకారమే సూర్యాపేట జిల్లా కేంద్రం మీదుగా, జాతీయ రహదారి 65 (NH 65) కు సమాంతరంగా నిర్మించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ శాసనసభ్యులు సంకినేని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో పార్లమెంటరీ రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యులు (Member of Parliamentary Standing Committee on Railways), రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ గారిని సంకినేని వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సూర్యాపేట మీదుగా బుల్లెట్ రైలు మరియు బుల్లెట్ రైలు స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఒక సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు.

**కేంద్ర మంత్రి, రైల్వే బోర్డు దృష్టికి తీసుకెళ్తాను - డాక్టర్ కె. లక్ష్మణ్**

వినతిపత్రంపై సానుకూలంగా స్పందించిన రాజ్యసభ సభ్యులు, రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ.. సూర్యాపేట ప్రజల సెంటిమెంట్‌ను మరియు ఈ ప్రాంత ప్రగతిని తాను గౌరవిస్తున్నట్లు తెలిపారు. బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను యథావిధిగా కొనసాగించేలా, NH 65 కి సమాంతరంగా ఈ ప్రాజెక్ట్ సాగేలా త్వరలోనే కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గారిని, అలాగే రైల్వే బోర్డు ఉన్నతాధికారులను కలిసి ప్రత్యేకంగా చర్చిస్తానని హామీ ఇచ్చారు. సూర్యాపేట ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానని లక్ష్మణ్ భరోసా ఇచ్చారు.



# ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులు : ప్రభుత్వ విప్





(సమయం ప్రతినిధి మహబూబ్నగర్): ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాడ్రెన్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల కంటే పిల్లలతో ఎక్కువ సమయం గడిపేది ఉపాధ్యాయులేనని, విద్యార్థుల గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండేది కూడా వారేనని అన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దితే సమాజంతో పాటు ఉపాధ్యాయులకు కూడా మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులను సమాజం గర్వించే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అనంతరం 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు పాస్ మెమోలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఈ విద్యాసంవత్సరం కూడా మంచి ఫలితాలు వస్తాయని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు ప్రవీణ్ కుమార్, ఎస్. శేఖర్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు దత్తు , ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

హైదరాబాద్: శ్రీశైలం ఎడమ గట్టు కాలువ ద్వారా తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (KRMB) ఏకపక్షంగా ఆదేశాలు ఇవ్వడం తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర అన్యాయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా. కురువ విజయ్ కుమార్ మండిపడ్డారు. కేఆర్ఎంబీ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థ అని, అది ఏపీ ప్రభుత్వం లేదా టీడీపీకి అనుకూలంగా వ్యవహరించడం సరికాదని ఆయన అన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను సమానంగా పరిగణనలోకి తీసుకుని న్యాయంగా వ్యవహరించాల్సిన బాధ్యత కేఆర్ఎంబీపై ఉందని స్పష్టం చేశారు.

**వెలిగొండ ద్వారా అక్రమంగా నీటి తరలింపు**

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలిస్తున్న అంశంపై కేఆర్ఎంబీ ఎందుకు స్పందించడం లేదని డా. విజయ్ కుమార్ ప్రశ్నించారు. సీడబ్ల్యూసీ, ఎన్జీటీ, కేంద్ర ప్రభుత్వ అనుమతుల అంశాలను పరిశీలించకుండా నీటిని తరలించడం ఎలా సమర్థనీయం? అని నిలదీశారు. ఆగస్టు 21 నాటికి శ్రీశైలం జలాశయంలో సుమారు 169 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ, వెలిగొండ ద్వారా రోజుకు సుమారు 11 టీఎంసీల చొప్పున నీటిని తరలిస్తూ ఇప్పటికే దాదాపు 30 టీఎంసీల నీటిని తరలించారని ఆయన ఆరోపించారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై ప్రభావం పడుతున్నా కేఆర్ఎంబీ ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు.

**పాలమూరు బిడ్డనని చెప్పుకునే సీఎం ఏం చేస్తున్నారు?**

కృష్ణా పరివాహక ప్రాంతంలో రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతూ 'క్రాప్ హాలిడే' ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని డా. విజయ్ కుమార్ విమర్శించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడాల్సింది పోయి, చంద్రబాబు నాయుడుకు అనుకూలంగా వ్యవహరిస్తూ తెలంగాణ నీటి ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు.

**కేఆర్ఎంబీ, కేంద్రానికి వెంటనే లేఖ రాయాలి**

వెలిగొండ ద్వారా జరుగుతున్న నీటి తరలింపుపై వెంటనే చర్యలు తీసుకోవాలని, తెలంగాణకు నష్టం కలిగించే నిర్ణయాలను అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే కేఆర్ఎంబీకి, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి అని డా. విజయ్ కుమార్ కోరారు.

**ఈ నెల 14లోపు నీటిని విడుదల చేయాలి**

తెలంగాణకు రావాల్సిన నీటిని వెంటనే విడుదల చేయాలని డా. విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 14లోపు తెలంగాణకు నీటిని విడుదల చేయకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేపడతారని తెలిపారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని, రైతుల ప్రయోజనాల కోసం అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతుందని డా. కురువ విజయ్ కుమార్ స్పష్టం చేశారు.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085